క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని అంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ దేవాలయ నిర్మాణానికి కైకొండాయిగూడెం చెందిన తుల్లూరి కృష్ణయ్య నిర్మల కుమారుడు ఫణికుమార్ శృతి దంపతులు లక్ష రూపాయలు విరాళం గురువారం అందజేశారు. కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.25వేలు..

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం నిర్మాణానికి గ్రామానికి చెందిన సుతారి మేస్త్రీ మునిగ వెంకన్న గురువారం రూ.25వేలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్యశిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: బీవీకే, సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మంచికంటి హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు జరిగే శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆర్థికసాయం

రఘునాథపాలెం: మండలంలోని వి.వెంకటయపాలెంలో ఇటీవల ఎస్టీ కాలనీలో కుక్కల దాడిలో గాయపడిన బాలుడు వైష్ణవ్ తేజ్‌ను సర్పంచ్ రావేళ్ల మాధవి గురువారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. దాడికి గల కారణాలను కనుకునిని మరలా ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు చూసుకుంటామన్నారు. తగు నివారణ చర్యలు చేపట్టాలని కార్యదర్శి శ్రీధర్‌రెడ్డికి ఆదేశాలు ఇచ్చారు.

ఆర్యవైశ్య సంఘం నియామకం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలం ఆర్యవైశ్య సంఘాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సంఘం మండల అధ్యక్షుడిగా ఆమంచి దయాకర్ ప్రధాన కార్యదర్శి కనమర్లపూడి శ్రీనివాసరావు, కోశాధికారిగా సంకా రత్నాకర్, ఉపాధ్యక్షులుగా బోనగిరి రమేష్, కార్యదర్శిగా సంకా భాస్కర్‌లు నియమించింది.

నివాళి

కామేపల్లి : కామేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్యా లాలునాయక్ మృతి చెందగా గురువారం ప్రజా ప్రతినిధులు, నాయకులు గురువారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్, నాయకులు రాంరెడ్డి శ్రీచరణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీరభద్రం యాదవ్, నారాయణరెడ్డి, సాంబశివరావు ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	బబుల్‌గమ్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	36		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	60	చుక్కకూర	3
బీర	60		20
దొండ	40	తోటకూర	3
పొట్లకాయ	40		10
నాటు చిక్కుడు	110	గోంగూర	2
గోరుచిక్కుడు	60		10
క్యాబేజీ	24	మెంతికూర	2
క్యాలీఫ్లవర్	36		10
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	48	పుదీన	1
క్యాప్సికం	80		20

-ఖమ్మం వ్యవసాయం

గ్యారంటీగా పథకాలు అందజేస్తాం..

● ప్రజాపాలనలో మంత్రి తుమ్మల



ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఆరుగ్యారంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులందరికీ తప్పకుండా లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం నగరంలోని 49వ డివిజన్ రామాలయం వద్ద నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం వరకు ప్రజాపాలన సభలు నిర్వహించి, దరఖాస్తుల స్వీకరిస్తామని, ప్రజాపాలన సభ రోజున వీలుకాని వారు తమ దరఖాస్తును తమ పంచాయతీ కార్యాలయాలు, వార్డు కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలన్నారు. మిగతా పథకాలు అమలు చేయడానికి ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఇంటింటికి వస్తాయని, ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, పట్టణ ఏసీపీ హరికృష్ణ, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, అధికారులు పాల్గొన్నారు.

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల, గోవింద్రాల, గోవింద్రాల బంజర, పొన్నేకల్ గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయ భాస్కరరెడ్డి, ఏఓ తారాదేవి, సర్పంచ్ బొడ్డు కాంతమ్మ, బానోత్ రవినాయక్, నాగండ్ల లక్ష్మణ్‌చౌదరి, ఉపసర్పంచ్ రాయల చిన్న వెంకన్న, రజిత, కార్యదర్శులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామస్తులు దరఖాస్తులను అందజేశారు. తహసీల్దారు సంపత్‌కుమార్, ఎంపీడీఓ విద్యాచందన, ఎంపీఓ రాంచందర్‌రావు పర్యవేక్షణలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు గ్రామంలో తహసీల్దారు రాంప్రసాద్, అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లి, ముజ్జుగూడెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మణ్ రావు, గోపాలరావు, జైపాల్, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ కడియాల శ్రీనివాసరావు, రిడేపల్లి రామారావు, బలుసు హనుమంతరావు, పాలడుగు వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ కాశిరాణి, ఆశ వర్కర్ సుశీల, గ్రామదీపిక అరుణ తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: లోక్యాతండాలో..



కామేపల్లి: కొత్తలింగాలలో..



తిరుమలాయపాలెం: సుబ్లేడులో..



నేలకొండపల్లి: సుర్దేపల్లిలో..

రికార్డుల నమోదులో నిర్లక్ష్యం వద్దు..



రికార్డులు పరిశీలిస్తున్న మయాంక్ సింగ్

కామేపల్లి: ప్రజాపాలనలో దరఖాస్తుదారుడి వివరాలను రికార్డులో నమోదు చేయాలని, రికార్డుల నమోదు ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ట్రైనింగ్ కలెక్టర్ మయాంక్ సింగ్ హెచ్చరించారు. గురువారం కామేపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వీకరించిన దరఖాస్తుల వివరాల రికార్డుల నమోదు నిర్వాహణ ప్రక్రియ పకడ్బందీగా ఉండాలన్నారు. ప్రజాపాలన గ్రామసభలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల స్వీకరణ తర్వాత దరఖాస్తుదారుడికి రశీదు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, సిబ్బంది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తొమ్మిది డివిజన్లలో ప్రజాపాలన

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలనలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం కేఎంసీ పరిధిలో తొమ్మిది డివిజన్‌లలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు ఈ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. 51డివిజన్ ఎమ్ఎస్పీ క్వార్టర్స్, బుర్హన్‌పురంలో, 52 డివిజన్ లెనిన్‌నగర్, బాలాజీనగర్‌లో, 53 డివిజన్ సహకారనగర్, ఎన్ఎస్పీ క్యాంపులో, 54 డివిజన్ వీడీవోస్ కాలనీలో, 55 డివిజన్ వీడీవోస్ కాలనీ, వేణుగోపాల్ నగర్‌లో, 56 డివిజన్ విజయనగర్ కాలనీలో, 57 డివిజన్ వికలాంగుల కాలనీ, రమణగుట్టలో, 58 డివిజన్ బీసీ కాలనీలో, 59 డివిజన్ దానవాయిగూడెంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ ఆరుగ్యారంటీలకు సంబంధించిన అభయహస్తం పథకాల కోసం డివిజన్లలోని సభల్లో దరఖాస్తులు చేసుకోని వారు కేఎంసీ కార్యాలయానికి పోటెత్తుతున్నారు. ఇప్పటి వరకు ప్రజాపాలన ముగిసిన డివిజన్‌లలో దరఖాస్తులు చేసుకోని ప్రజలు కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో తమ దరఖాస్తులను అందజేస్తున్నారు. ఇందుకోసం అధికారులు కేఎంసీలో హెల్ప్ డెస్క్‌తో పాటు పది వరకు కౌంటర్లను ఏర్పాటు చేశారు.

గృహజ్యోతిలో వివరాలు రాయండి..

ఖమ్మంవ్యవసాయం: చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గృహజ్యోతి వివరాలను కూడా దరఖాస్తులో నమోదు చేయాలని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఏ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులో పేర్కొనబడిన గృహజ్యోతి అనే అంశంలో 8 అంకెల యూఎస్‌సీ సర్వీస్ నంబర్‌ను నమోదు చేయాలని తెలిపారు. సొంత ఇల్లు కలిగి ఉండి కరెంటు మీటర్ కలిగిన ప్రతీ ఒక్క వినియోగదారుడు, కిరాయికి ఉన్నా తాము వినియోగిస్తున్న సర్వీసు నంబరును నమోదు చేసి దరఖాస్తును సమర్పించాలని తెలిపారు.ఎలాంటి సందేహాలున్నా ప్రజాపాలన వేదిక వద్ద గల హెల్ప్‌డెస్క్‌లో లేదా సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 12న చేపట్టిన చలోపార్లమెంట్‌ను జయప్రదం చేయాలని ఆయా సంఘాల జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్‌లు కోరారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల సంయుక్త సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా కాషాయకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సుధాకర్, కౌశిక్, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

నేలకొండపల్లి: 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ ఈ ప్రమీల కోరారు. స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులను శనివారంలోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 4 వతరగతి చదువుతున్న వారు అర్హులని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

ఖమ్మంవన్‌టౌన్/ తిరుమలాయపాలెం: కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన దేరంగుల పద్మ బంధువులు మంత్రి తుమ్మలను సంప్రదించగా వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.లక్షా యాభై వేలు మంజూరు చేయించి ఆ చెక్కును బాధితులకు గురువారం అందజేశారు. కార్పొరేటర్లు కమర్తపు మురళీ, రావూరి సైదుబాబు, చావా నారాయణరావు, పోట్ల వీరేందర్, మందడపు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారావు నివాసానికి తుమ్మల



తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం వన్‌టౌన్: తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కేవీ.కృష్ణారావు నివాసానికి మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెళ్లారు. గురువారం 58వ డివిజన్ వివేకనందా కాలనీలోని ఆయన నివాసంలో తేనేటి విందును ఆస్వాదించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన తెలంగాణ ఉద్యమకారులను కాపాడుకుంటూ వస్తానన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో ఐఏఎల్ నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్లో ఐఏఎల్ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, మాదిరాజు లక్ష్మీ నారాయణ, సుధాకర్, పెద్ద హైగ్రీవ, రామాంజనేయులు, ఆకుల శేఖర్ బాబు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడకు శుభాకాంక్షలు

ఖమ్మంఅర్బన్: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కు గురువారం మంత్రి నివాసంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గొల్లపూడి హరికృష్ణ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హరికృష్ణతోపాటు, నాయకులు భూక్యా అశోక్, మోరంపూడి సాయి తదితరులు ఉన్నారు.

మూడు బొమ్మలు ఏర్పాటుచేయాలి

ఖమ్మంమయూసెంటర్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే దారిలో పంపింగ్‌వెల్ చౌరస్తా వద్ద తొలగించిన మూడు బొమ్మలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్లు, త్రీటౌన్ వాసులు కేఎంసీ కమిషనర్‌ను కోరారు. గురువారం కార్పొరేటర్లు కమర్తపు మురళి, దొడ్డా నగేష్‌ల ఆధ్వర్యంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభికి మూడు బొమ్మలు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల ఇచ్చిన హామీ మేరకు బొమ్మలను ఏర్పాటు చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. త్వరగా బొమ్మలను ఏర్పాటుచేయాలని కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ రమేష్, కల్వకుంట్ల గోపాల్‌రావు, లక్ష్మీనారాయణ, నల్లమల ఆనంద్, సిరికొండ వెంకన్న, బాణాల లక్ష్మణ్, గజ్జెల వెంకన్న పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

ఖమ్మంఅర్బన్: ధనుర్మాసంలో సంక్రాంతికి గోదాదేవి కల్యాణం సందర్భంగా గురువారం నగరంలోని శ్రీ శ్రీ నగర్ లో ఉన్న అభయ వెంకటేశ్వర స్వామి గుడిలో అమ్మవారికి శ్రీ లక్ష్మి బాలాజి సేవ సమితి గ్రూపు ఆధ్వర్యంలో చీరె సారే సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సారెతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నేడు ప్రశాంతి హాస్పిటల్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ భరత్‌బాబు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం నెహ్రూనగర్‌లో ఏర్పాటుచేసిన ప్రశాంతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు యాజమాన్యం, వైద్యులు కేసోజు భరత్‌బాబు తెలిపారు. ఆస్పత్రిలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వైద్యులు టి.హరిప్రసాద్, వి.భాస్కర్, కృష్ణప్రసాద్, జీవన్‌కుమార్, గౌతమ్ వినయ్, పాటిబండ్ల హేమంత్, చింతపల్లి కుమార్‌తో కలిసి మాట్లాడారు. ప్రశాంతి హాస్పిటల్ పేరుతో తొమ్మిదేళ్ల పాటు సేవలందించామని చెప్పారు. ఇప్పుడు వంద పడకలతో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ వంటి పట్టణాలకు దీటుగా మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. హాస్పిటల్‌ను శుక్రవారం ఉదయం మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారని భరత్‌బాబు తెలిపారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నేలకొండపల్లి: పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ కోరారు. పథకంపై గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటి హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, పొగర్తి సుధాకర్, మన్నె రాధాకృష్ణ, మోహినుద్దీన్, రామకృష్ణ, రమణ, గోపి, కృష్ణారావు, వేణు, గణేష్ పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న ట్రస్ట్, సొసైటీ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో గురువారం భిక్షాటన చేసే అనాథ వృద్ధుడు మృతిచెందడంతో ప్రకాశ్‌నగర్ వైకుంఠధామంలో బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు, కాటికాపరి జాంబవంతుడు సొసైటీ సభ్యులు పందివేణు, కె.సైదులు, వీరస్వామి, కాశయ్య, చుక్కయ్య పాల్గొన్నారు

అక్షింతలు పంపిణీ



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని బాలాంజనేయ స్వామి దేవస్థానంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పూజలు చేసి అనంతరం అక్షింతలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి ప్రతీ కుటుంబానికి అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అక్కి వెంకటేశ్వర్లు , తిరుమల తిరుపతి ప్రచార కమిటీ బాధ్యులు రామకృష్ణారెడ్డి ,ఆలయ అర్చకులు హరి శర్మ భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఖమ్మం సహకారనగర్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు , పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు షమి, నాయకులు బుర్రి వెంకన్న, రాంబాబు, రంజాన్, సురేష్, రాందాస్, గీత, జ్యోతి, లక్ష్మీకుమారి, లక్ష్మి, హబీబాబేగం, కస్తూరిబాయి, రమణ, సీత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ చేస్తారట!

తెరపైకి నేలకొండపల్లి మున్సిపాలిటీ

- చుట్టుపక్కల గ్రామాలను విలీనం అంటూ పుకార్లు
- పంచాయతీ ఎన్నికల నేపథ్యాన ముదురుతున్న రాజకీయ వేడి

ప్రతీ పంచాయతీ ఎన్నికల సమయాన నేలకొండపల్లి మేజర్ పంచాయతీ మున్సిపాలిటీగా మారుతుందనే పుకార్లు.. షికార్లు చేస్తున్నాయి. చుట్టుపక్కల గ్రామ పంచాయతీలకు మేజర్ పంచాయతీలో విలీనం చేస్తే మున్సిపాలిటీ అర్హత సాధిస్తుందని అందుకు అధికారులు పావులు కదుపుతున్నారని ఆయా గ్రామాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆయా గ్రామాల్లో రాజకీయ వాతావరణ వేడెక్కుతోంది.



నేలకొండపల్లి ప్రధాన సెంటర్

నేలకొండపల్లి: మేజర్ పంచాయతీగా ఉన్న నేలకొండపల్లిని మున్సిపాలిటీ చేస్తున్నారని ప్రచారం జోరుగా సాగుతుంది. గత ఐదేళ్ల క్రితం పంచాయతీ ఎన్నికల సమయాన ఇదే మాదిరిగా విస్తృతంగా ప్రచారం చేశారు కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. మళ్లీ పంచాయతీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనుండగా.. మరోమారు మున్సిపాలిటీ చర్చ తెరకెక్కింది.

మున్సిపాలిటీ కావాలంటే..

మేజర్ పంచాయతీగా ఉన్న నేలకొండపల్లిని మున్సిపాలిటీ చేయాలంటే కనీసం 25 వేల నుంచి 30 వేల వరకు జనాభా కలిగి ఉండాలి. కానీ ప్రస్తుతం నేలకొండపల్లి మేజర్ పంచాయతీ జనాభా 9,816 మంది కాగా అందులో 2,538 కుటుంబాలు, 6,788 మంది ఓటర్లు ఉన్నారు. కావునా మున్సిపాలిటీకి అర్హత సాధించడం కష్టం. అందుకే నేలకొండపల్లికి 4 కిలో మీటర్ల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీలను విలీనం చేస్తే మున్సిపాలిటీకి అర్హత సాధిస్తుందని అందుకే ఆ పంచాయతీలను మున్సిపాలిటీలో కలుపుతున్నారని ప్రచారం జోరుగా సాగుతుంది.

విలీనానికి అవకాశం ఉన్న గ్రామాలు..

మండలంలోని 4 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆచార్లగూడెం, ఆరెగూడెం, కోనాయిగూడెం, సదాశివాపురం, కొత్తకొత్తూరు, అనాసాగారం, ముజ్జుగూడెం గ్రామాలను విలీనం చేస్తే ఉన్న జనాభా ఆధారంగా మున్సిపాలిటీ చేస్తున్నారని ఆయా గ్రామాల రాజకీయ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. కాగా, పంచాయతీలుగా ఉన్న గ్రామాలను మున్సిపాలిటీగా చేస్తే ప్రజలపై పన్నుల భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీలను యథావిధిగా పంచాయతీలుగానే కొనసాగించాలని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీ అయితే ఏ సామాజిక వర్గం నుంచి చైర్మన్‌గా ఎవరు ఉండాలి అనే విషయంపై రహస్యంగా ఒప్పందం చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల నుంచి కార్పొరేటర్‌గా ఇప్పటికే పేర్లను ఎంపిక చేసుకున్నట్లు ప్రచారం. కానీ మున్సిపాలిటీ విషయాన్ని అధికారులు కొట్టిపారేశారు.

ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం..



మేజర్ పంచాయతీగా ఉన్న నేలకొండపల్లి మున్సిపాలిటీగా మారితే అభివృద్ధి వైపు పయనిస్తుంది. ప్రభుత్వం కూడా నిధులు అధికంగా కేటాయిస్తుంది. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన పంచాయతీలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మున్సిపాలిటీ ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం.

– జెర్రిపోతుల సత్యనారాయణ, నేలకొండపల్లి

ప్రజలపై భారం పడుతుంది..



మేజర్ పంచాయతీ పంచాయతీగా ఉంటేనే ప్రజలకు మంచిది. లేదంటే ప్రభుత్వానికి చెల్లించే పన్నులతో ప్రజలపై భారం పడుతుంది. ప్రతిపాదనలపై అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలి. అందరి అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలి.

– రాయపూడి నవీన్, సర్పంచ్, నేలకొండపల్లి

ఎలాంటి ఆదేశాలు రాలేదు..



నేలకొండపల్లి మేజర్ పంచాయతీకి సంబంధించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం అందుకు సంబంధించి తమను ఇంత వరకు ఎలాంటి వివరాలు అడగలేదు. గ్రామాల్లో జరిగే ప్రచారం గురించి తమకు తెలియదు.

– సీహెచ్.శివ, మండల పంచాయతీ అధికారి, నేలకొండపల్లి